సాక్షి మహబూబాబాద్

శుక్రవారం | 17 | నవంబర్ | 2023

రూ.19.67లక్షల నగదు స్వాధీనం



ఎ'లక్షణం'గా సాగేందుకు..

- వివిధ స్థాయిల్లో ఎన్నికల అధికారుల విధులు
- బూత్ లెవెల్ నుంచి జిల్లాస్థాయి వరకు..
- ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు చర్యలు

ఓటు.. వదలనీయం

- ఎన్నికల నిర్వహణలో బ్లాగ్ విధులు
- ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన
- ప్రలోభాల కట్టడికి పకడ్బందీ చర్యలు

- వివరాలు 10లో

జంగ్ తెలంగాణ

గరిష్టం/కనిష్టం $32.8^0/17.5^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



కురవి: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండలంలోని బలపాల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు (అండర్ –14 విభాగం)ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ రవికుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం నుంచి మహబూబ్‌నగర్‌లో జరగే రాష్ట్రస్థాయి పోటీలకు బలపాల స్కూల్‌కు చెందిన రొయ్యల రాహుల్, బత్తుల లెనిన్, కాసాని ఉదయ్, ప్రభుకిరణ్ ఎంపికైనట్లు తెలిపారు. వీరిని పాఠశాలకు చెందిన హెచ్‌ఎం కె.నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, బీవీబీ ప్రసాద్, శ్రీనివాస్, జయశ్రీ, కన్నయ్య, జయ, మహబూబ్‌అలీ, సీతారాములు అభినందించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ గురువారం తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు డిపో అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలనుకునేవారు సాయంత్రం 4నుంచి 5 గంటల వరకు 99592 26054 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

పోలీస్ బలగాల ఫ్లాగ్‌మార్చ్



బయ్యారం: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండలంలోని ఉప్పలపాడు, వెంకట్రాంపురం పంచాయతీల్లో గురువారం పోలీస్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా గార్ల–బయ్యారం సీఐ బాబురావు, ఎస్సై ఉపేందర్ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు.

19న మానుకోటకు హైకోర్టు జడ్జిల రాక



మహబూబాబాద్ రూరల్: తెలంగాణ హైకోర్టు జడ్జి, మానుకోట జిల్లా కోర్టు పరిపాలన జడ్జి జస్టిస్ భీమపాక నగేష్, హైకోర్టు జడ్జి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ఈ నెల 19న జిల్లా కేంద్రానికి వస్తారని జిల్లా కోర్టు పరిపాలన అధికారి ఎం.క్రాంతికుమార్ గురువారం తెలిపారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ ఆధ్వర్యంలో నూతనంగా ఆధునీకీకరించిన జిల్లా కోర్టు హాల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కార్యకలాపాల భవనాన్ని ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.


నేడు కేయూలో నేషనల్ కాన్ఫరెన్స్

కేయూ క్యాంపస్: కేయూలోని బాటనీ విభాగం, అలూమ్ని అసోసియేషన్ కొలబరేషన్‌తో ఈ నెల 17న ఒక రోజు నేషనల్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్నారు. బాటనీ విభాగంలోని సెమినార్‌హాల్‌లో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ బొటానికల్ రీసెర్చ్ అంశంపై ఈ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా వీసీ తాటికొండ రమేశ్, గౌరవ అతిథిగా కేయూ మాజీ వీసీ విద్యావతి, బాటనీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు ఎస్‌ఎం రెడ్డి, ఓయూ ఎస్‌ఏఎస్‌ఐ సైంటిస్ట్ ప్రొఫెసర్ సి.మనోహరాచారి, కేయూ బాటనీ విభా గం సీనియర్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ తిరుపతయ్య, బాటనీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, మానుకోట మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర సీతారాంనాయక్ పాల్గొంటారని ఆవిభాగాధిపతి లక్ష్మారెడ్డి, బీఓఎస్ ప్రొఫెసర్ ముస్తాఫా గురువారం తెలిపారు. ఉత్తరప్రదేశ్ లక్నోలోని బీబీఏ యూనివర్సిటీలోని ఎర్త్ ఎన్విరాన్‌మెంట్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ నవీన్‌కుమార్ ఆరోరా కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు.

'రౌద్రం' కవితా సంపుటి ఆవిష్కరణ

హన్మకొండ: ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఏకు తిరుపతి రచించిన రౌద్రం కవితా సంపుటిని బుధవారం రాత్రి హనుమకొండ నక్కలగుట్టలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు రౌతు రమేశ్ కుమార్, అరెపల్లి శ్రీనివాస్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, ఆయా సంఘాల నాయకులు, విద్యావేత్తలు మాతంగి శ్రీనివాస్, బక్క దానయ్య, ప్రొఫెసర్ నతానియల్, కోలా జనార్దన్, ప్రొఫెసర్లు కుమారస్వామి, కనకరత్నం, ఇంజనీర్ ఉపేందర్, ఓరం సమ్మయ్య, దబ్బెట రమేశ్, కె.రవీందర్, ఎక్కిరాల రాజు, ఏకు రవీందర్, ఏకు సంపత్, దొమ్మటి ప్రవీణ్‌కుమార్, సాంబయ్య, మహమ్మద్ పాల్గొన్నారు.

తొలి ఓటు



జంగ్ తెలంగాణ

జిల్లాలో 19,588 మంది కొత్త ఓటర్లు

- మొదటిసారి ఓటు హక్కు వినియోగానికి ఉత్సాహం
- సరైన పాలకులను ఎన్నుకుంటామంటున్న యువత
- ఉద్యోగ, ఉపాధికి మార్గం చూపాలని డిమాండ్

సాక్షి, మహబూబాబాద్: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధంలాటింది. సరైన పాలకుడిని ఎన్నుకోవడంలో ఓటే కీలకం. కాగా జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన 19,588మంది యువతీ యువకులు నూతనంగా ఓటరుగా నమోదై.. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉత్సాహం చూపుతున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటును సక్రమంగా వినియోగించుకుంటామని తెలుపుతున్నారు. సమస్యలు పరిష్కరించే నిస్వార్థ నాయకులు, అభివృద్ధి, విజన్, ఉన్నతవిద్యావంతుడు, నిత్యం జనాల్లో ఉండే, విద్యాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే నాయకులను ఎన్నుకుంటామని నూతన ఓటర్లు తమ అభిప్రాయాలను వెల్లిబుచ్చారు.

ఓటు అమ్ముకోవద్దు..



నేను మొదటిసారి ఓటు వేస్తున్నాను. మానుకోట జిల్లాను అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకుంటా. ఉపాధి కోసం పలు కంపెనీలను తీసుకువచ్చి, మానుకోట ప్రజలకు ఉపాధి కల్పించాలి. మంచి పరిపాలన, ప్రజలకు అందుబాటులో ఉండే, న్యాయం చేసే ఎమ్మెల్యే మాకు కావాలి. అంతే కానీ ఓటును అమ్ముకోవడం.. డబ్బులు ఇచ్చిన వారికి ఓటు వేసే సంస్కృతి మారాలి.

– మేకల పృథ్వీరాజ్, రామచంద్రపురం, మానుకోట

మంచి పాలకుడైతే.. మంచి పనులు చేస్తారు



రాజ్యాంగ కల్పించిన ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకుంటా. మంచి పాలకుడైతే.. మనల్ని మంచిగా పాలిస్తాడు. నేర చరిత్ర, అక్రమ వ్యాపారాలు, లంచగొండితనం ఉన్న నాయకుడికి ఓటు వేస్తే ఐదు సంవత్సరాలు బాధపడాలి. అభివృద్ధిలో వెనకబడుతాం. ఉన్నత చదువులు చదివిన వారికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు ముందుకు వచ్చే నాయకుడు ఇప్పుడు కావాలి.

– జి.కల్యాణ్, విద్యార్థి, కురవి

మొత్తం, కొత్త ఓటర్ల వివరాలు

మండలం	మొత్తం ఓటర్లు	కొత్త ఓటర్లు
డోర్నకల్ నియోజకవర్గం		
చిన్నగూడూరు	12,566	530
దంతాలపల్లి	24,271	901
డోర్నకల్	38,744	1,555
కురవి	41,785	1,821
మరిపెడ	58,704	2,678
నర్సింహులపేట	24,013	1,065
సీరోలు	19,181	759
మొత్తం	2,19,264	9,309
మహబూబాబాద్ నియోజకవర్గం		
గూడూరు	46,591	1,945
ఇనుగుర్తి	17,621	744
కేసముద్రం	47,083	1,990
మహబూబాబాద్	1,01,196	3,925
నెల్లికుదురు	39,211	1,609
దంతాలపల్లి	1,640	66
మొత్తం	2,53,342	10,279
గ్రాండ్ టోటల్	4,72,606	19,588

చదువు విలువ తెలిసిన వారికే మద్దతు



నాయకుడికి చదువు విలువ తెలిస్తే.. ఉన్నత చదువులు చదివిన విద్యార్థులకు ఉపాధి మార్గం చూపాలనే ఆలోచన వస్తుంది. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి పరిశ్రమలు నెలకొల్పడం, అవినీతి రహిత పాలన, అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించే వారికే ఓటేస్తాను. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చే వారికే నా మద్దతు.

– పుట్ట రోహన్, బీటెక్, సాయినగర్ నాలుగో వీధి, డోర్నకల్

ఓటు వృథా కావద్దు..



తొలిసారి ఓటు హక్కు వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటాను. ఎప్పుడెప్పుడు ఓటు వేయాలా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. అయితే తొలిసారి వేసే ఓటుకు ప్రాధాన్యత ఉంటుంది. మంచి నాయకుడిని ఎన్నుకోవడమే నా లక్ష్యం. ఓటు వృథా కావద్దు. విద్యా, వైద్యం, ఉపాధి మార్గాలు చూపే నాయకుడు కావాలి.

– జి.అఖిల, విద్యార్థిని, తొర్రూరు

ఉపాధి కల్పించేవారికే నా ఓటు



అసెంబ్లీ ఎన్నికల ద్వారా మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. డోర్నకల్ ప్రాంతంలో మెరుగైన విద్యా సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేసే వారికే ఓటు వేస్తాను. ఉచితాల కంటే ఉత్పాదక శక్తిని పెంచే పథకాలు అమలు చేసే వారికే నా ఓటు. దీంతో ఎవరి పనులు వారు చేసుకుంటారు. వారి వారి కుటుంబాల పోషణకు ఆదాయం సమకూర్చుకుంటారు.

– కొరివి సాహిత్య, బీటెక్ విద్యార్థిని, సుభాష్ వీధి, డోర్నకల్

పరకాలకు సీఎం.. వరంగల్‌కు రాహుల్

నేడు ప్రజాఆశీర్వాద సభలో ప్రసంగించనున్న కేసీఆర్

- నర్సంపేటలో రాహుల్‌గాంధీ భారీ బహిరంగ సభ, వరంగల్ తూర్పులో పాదయాత్ర, కార్నర్ మీటింగ్
- పోలీసుల పటిష్ట బందోబస్తు

పరకాల/వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఎం కేసీఆర్, ఏఐసీసీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ శుక్రవారం పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పరకాలలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. పరకాల–రాజీపేట శివారులోని వెల్లంపల్లి రోడ్డులో గల 10 ఎకరాల భూమిలో సభ ఏర్పాట్లు జరుగుతున్నాయి. లక్ష మంది సభకు వస్తారనే అంచనాతో స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పర్యవేక్షణలో బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 4గంటలకు జరిగే సభకు సీఎం కేసీఆర్ చేరుకుంటారు. సభాస్థలికి 300 మీటర్ల దూరంలోనే హెలిపాడ్ ఏర్పాట్లు చేశారు.

సభాస్థలిని పరిశీలించిన సీపీ



వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా సీఎం సభాస్థలితో పాటు హెలిపాడ్‌ను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. బందోబస్తు గురించి పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. 1 డీసీపీ, 4 ఏసీపీలు, 10 మంది సీఐలు, 20 మంది ఎస్సైలతో సహా కానిస్టేబుల్స్, గ్రేహౌండ్ పోలీసులు మొత్తం 300 మందితో బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



సీఎం సభాస్థలి ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

నర్సంపేట, వరంగల్‌లో రాహుల్



ఏఐసీసీ నాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీ శుక్రవారం వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లా పినపాక నుంచి మధ్యాహ్నం 1.25 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి 1.55 గంటలకు నర్సంపేటకు చేరుకుంటారు. నర్సంపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు పాల్గొంటారు. మధ్యాహ్నం 3.10 గంటలకు నర్సంపేట నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 3.25 గంటలకు మామునూరులోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. 3.40 గంటలకు వాహనంలో వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి వరంగల్ చౌరస్తా మీదుగా పోచమ్మ మైదాన్ వరకు పాదయాత్ర నిర్వహిస్తారు. అక్కడ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడతారు. పాదయాత్ర, కార్నర్ మీటింగ్‌లో రాహుల్ సుమారు 80 నిమిషాలు గడపనున్నారు. ఎంజీఎం జంక్షన్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తారు. అనంతరం వాహనంలో మామునూరుకు చేరుకుని సాయంత్రం 5.15 గంటలకు హెలికాప్టర్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్తారని అధికారులు విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

ఆకాశదీప పూజలు



మహబూబాబాద్ రూరల్: కార్తీక మాసోత్సవాల సందర్భంగా మానుకోటలోని వేణుగోపాలస్వామి వారి దేవాలయంలో గురువారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకుడు ముడుంబై లక్ష్మీనారాయణచార్యులు ఆధ్వర్యంలో ఆకాశ దీప పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆకాశ దీపాన్ని దర్శించుకుని ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణ ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: ఎన్నికల అధికారులు విస్తృతంగా పర్యటించాలని, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, సీ–విజిల్ యాప్ పనితీరుపై జనరల్ అబ్జర్వర్ ఇరా సింఘాల్, ఎస్పీ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్‌తో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిని ఉపేక్షించేదిలేదన్నారు. ఎన్నికల అబ్జర్వర్లు పర్యటిస్తున్నారని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ రోజువారీ నివేదికలు అందజేయాలన్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్లపై దృష్టి పెట్టాలని, ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ర్యాలీలు, సమావేశాలలో ఏర్పాటు చేసే సామగ్రిని వీడియో తీయించాలని, తీసిన ప్రతీ వీడియోను అధికారులకు అందజేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ డేవిడ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఓటర్లకే అందజేయాలి..

ఓటరు గుర్తింపు కార్డులను సంబంధిత ఓటర్లకు మాత్రమే అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎపిక్ ఓటరుఫొటో గుర్తింపు కార్డుల పంపిణీపై ఎన్నికల విభాగం, పోస్టల్ విభాగం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆర్డర్ ఇచ్చిన కార్డుల వివరాలు, ప్రింట్ అయి వచ్చిన కార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 54,000 ఫొటో ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరే కార్డులు అందజేయాలని సూచించారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

మహబూబాబాద్/మరిపెడ రూరల్: జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో బరిలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించింది. బుధవారం ఉపసంహరణ, ఫైనల్ జాబితా వెల్లడికాగా.. గురువారం గుర్తులు కేటాయించినట్లు మానుకోట, డోర్నకల్ ఆర్వోలు అలివేలు, నర్సింహారావు తెలిపారు.

మానుకోట నియోజకవర్గ అభ్యర్థులు.. కేటాయించిన గుర్తులు..

గుగులోత్ శేఖర్–బీఎస్పీ(ఏనుగు గుర్తు), బానోత్ శంకర్‌నాయక్–బీఆర్‌ఎస్(కారు), భూక్య మురళీనాయక్–కాంగ్రెస్(హస్తం), జాటోత్ హుస్సేన్ నాయక్–బీజేపీ (కమలం), జాటోత్ చక్రవర్తి– ధర్మ సమాజ్ పార్టీ(బ్యాటరీటార్చ్), జాటోత్ బిచ్చా నాయక్–ఎంసీపీఐ (కెమెరా), పోనక రాందాస్–రిపబ్లిక్ పార్టీ ఆఫ్ఇండియా(గ్యాస్‌స్టవ్), వట్టం ఉపేందర్–బహుజనముక్తి పార్టీ (మంచం), డివినాయక్ (ఫుట్‌బాల్), నూనావత్ రమేష్(ఉంగరం) బట్టు బిన్నమ్మ(కత్తెర), గుగులోత్ వెంకన్నకు (గన్నా కిసాన్) గుర్తు కేటాయించారు.

డోర్నకల్ నియోజకవర్గ అభ్యర్థులు.. కేటాయించిన గుర్తులు..

గుగులోతు పార్వతి–బీఎస్పీ(ఏనుగుగుర్తు), డీఎస్ రెడ్యానాయక్–బీఆర్‌ఎస్(కారు), రాంచంద్రు నాయక్–కాంగ్రెస్(హస్తం), భూక్య సంగీత(కమలం) గుర్తు కేటాయించారు. అలాగే స్వతంత్ర, రిజిస్టర్ పార్టీ అభ్యర్థులు గుగులోతు రవీందర్(కోట్ గుర్తు), తేజావత్ సోమన్న(రోడ్డు రోలర్), బాదావత్ రాజేష్(బ్యాట్), బానోతు లింగన్న(మిక్సీ), భూక్య మహేందర్(గన్న కిసాన్), వాంకుడోతు రవికుమార్(చపాతిరూలర్), గుగులోతు నరేష్(ఫుట్‌బాల్), ఇస్లావత్ ఠాగూర్ రవీందర్‌నాయక్ (కెమెరా), భూక్య గోపికృష్ణ(సాసర్), అజ్మీరా రత్నాకు(కుట్టుమిషన్) గుర్తు కేటాయించారు.

కాజీపేట జంక్షన్‌లో రైల్వే గ్రీవెన్స్ మేళా..

కాజీపేట రూరల్: రైల్వే కార్మికులు, రిటైర్డ్ కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సికింద్రాబాద్ రైల్వే పర్సనల్ బ్రాంచ్ బృందం అధికారులు రైల్వే గ్రీవెన్స్ మేళాను గురువారం ఏర్పాటు చేశారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో గురువారం సికింద్రాబాద్ రైల్వే ఏపీఓ జి.లక్ష్మిసురేఖ, సీఓఎస్ సంగీత, సురేశ్ భూపతి, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ సరళమాధవి, కాజీపేట వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ సంధ్య ఇతర పర్సనల్ బ్రాంచ్ స్టాఫ్ రైల్వే కార్మికుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇంక్రిమెంట్లు, లీవ్స్, మెడికల్, పెన్షన్, లైఫ్ సర్టిఫికెట్, సీజీ ఎంప్లాయీస్ సంబంధిత దరఖాస్తులను సికింద్రాబాద్ అధికారుల బృందానికి అందజేశారు. ఐడీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న రైల్వే ఎంప్లాయీస్‌కు 194 మందికి ఐడీ కార్డులు జారీ చేశారు.. 320 రిక్రియేషన్, 100 ఫిర్యాదులు అందినట్లు అధికారులు చెప్పారు.

ఇంటి వద్దే ఓటు హక్కు..

దివ్యాంగులు, 80ఏళ్లు దాటిన వారికి అవకాశం

- 12డీ ఫాం ద్వారా దరఖాస్తులు
- దివ్యాంగులు 477మంది, వయోవృద్ధులు 665 మంది
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

మహబూబాబాద్: జిల్లాలోని మానుకోట, డోర్నకల్ నియోజకవర్గాల తుది ఓటరు జాబితాను ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక విడుదల చేశారు. దీనిలో దివ్యాంగులు, 80ఏళ్లు పైబడిన ఓటర్ల వివరాలను కూడా వెల్లడించిన విషయం తెలిసిందే. కాగా ఈసారి ఎన్నికల కమిషన్ దివ్యాంగులు, 80ఏళ్లు పైబడిన ఓటర్లు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. దీనికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 12డీ ఫాంల స్వీకరణ పూర్తి చేసి వారి జాబితాను సిద్ధం చేశారు.



దివ్యాంగులు 12,691..

జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 12,691 మంది దివ్యాంగులు ఉన్నారు. కాగా వీరిలో ఇంటివద్దే ఓటు హక్కు వినియోగించుకునేందుకు 477 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 80 సంవత్సరాలు పైబడిన వారు 6,601 మంది ఉండగా.. 665 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరు కూడా ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

వారి ఇంటికే..

దివ్యాంగులు, వయోవృద్ధుల ఇంటికి పోలీస్, బీఎల్‌ఓ, ప్రిసైడింగ్ అధికారి, బూత్ ఏజెంట్, పార్టీ నాయకులు ఈవీఎంలతో వెళ్లి ఓటు వేయిస్తారు. ఓటు ఏ పోలింగ్ బూత్ పరిధిలో ఉంటే అక్కడే జమ చేస్తారు. ఇలా దరఖాస్తు చేసుకున్న వారందరూ ఓటు వేసేలా చర్యలు తీసుకుంటారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు..

దివ్యాంగులు, వృద్ధుల కోసం పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, వీల్‌చైర్లు ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 25లోపు తహసీల్దార్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో తహసీల్దార్, మున్సిపాలిటీ కార్యాలయాలకు వీల్‌చైర్లు సరఫరా చేస్తారు. వీల్‌చైర్స్‌కు సహాయకులను ఏర్పాట్లు చేస్తారు. కాగా కేంద్రాల్లో వీల్‌చైర్ల ట్రయల్‌రన్ కూడా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

గ్రంథాలయ వారోత్సవాలు



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రాజు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ.. పుస్తకం హస్తభూషణం అని, మానవ వికాసానికి తోడ్పడుతుందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకుని జీవితంలో ఎదగాలన్నారు. వారంపాటు పుస్తక ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మమత, లైబ్రేరియన్ చిత్తనూరి మల్లేశం, అధ్యాపకులు యుగంధర్, బొంద్యాలు, వేణుగోపాల్, రామరత్నమాల, వెంకటేశ్వర్లు, రాజేందర్, రాంరెడ్డి, నరహరి, సుజిత్ రెడ్డి, శశికాంత్, కాసిం, హథీరాం, సంతోష్ కుమార్, వీరు, సుమలత, రవితేజ, ఉపేందర్, రఘురాం, రామన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

రక్తదానం మరొకరికి ప్రాణదానం

- అదనపు కలెక్టర్ డేవిడ్

నెహ్రూసెంటర్: రక్తదానం చేసి మరొకరికి ప్రాణం పోయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నందనగార్డెన్‌లో గురువారం విద్యుత్ శాఖ మహబూబాబాద్ డివిజన్ యూనియన్ల సిబ్బంది ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ భాగస్వామ్యంతో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రక్తదానం చేసేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలన్నారు.18నుంచి 60సంవత్సరాల వరకు ఆరోగ్యవంతమైన వ్యక్తులు రక్తదానం చేయవచ్చన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో రక్తదానంపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. విద్యుత్‌శాఖలోని 111మంది ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. విద్యుత్‌శాఖ డీఈ పెరుమాళ్లపల్లి విజయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఈ నరేష్, డీఆర్‌డీఓ సన్యాసయ్య,డీఎంహెచ్‌ఓ అంబరీష,రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాద్, ప్రభుత్వ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ లకావత్ వెంకట్,ఆర్‌ఎంఓ వైదేహి, డీఈలు సునీతాదేవి,మధుసూదన్,ఏఓ సంతోష్, విద్యుత్‌శాఖ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

సీఎం బహిరంగ సభకు స్థల పరిశీలన..

మరిపెడ రూరల్: మరిపెడలో ఈ నెల 21న నిర్వహించే డోర్నకల్ నియోజకవర్గ సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ కోసం స్థలాన్ని తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వర్లబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్ గురువారం పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మరిపెడలో నిర్వహించే బహిరంగ సభకు కేసీఆర్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సీఎం బహిరంగ సభ ప్రాంగణం, హెలిపాడ్ స్థలం, వివిధ వాహనాలు పార్కింగ్, కార్యకర్తలు కూర్చునే స్థలాన్ని వారు పరిశీలించారు. సభ ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో మరిపెడ సీఐ ఎల్ రాజు, ఎస్సై పవన్‌కుమార్, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నాయకులు రాంలాలు, తేజావత్ రవీందర్‌నాయక్, వార్డు కౌన్సిలర్లు సుజాత వెంకన్న, పరశురాములు పాల్గొన్నారు.



మరిపెడలో సభ స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లబాబు

వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న అరూరి రమేశ్



అవ్వా.. నీ ఓటు నాకే వేయాలి..

బీఆర్‌ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతనెక్కొండలో ఓ వృద్ధురాలి దగ్గరికి వెళ్లి 'అవ్వా.. నీ ఓటు నాకే వేయాలి' అని అభ్యర్థించారు.

– పర్వతగిరి

నీకైతే మిర్చి వేస్తా..నాకైతే ఓటెయ్యి

బీఆర్‌ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం మండలంలోని కోలుకొండలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ హోటల్ వద్ద మిర్చి చేసి ఓటు అభ్యర్థించారు.

–దేవరుప్పుల



కోలుకొండలో మిర్చివేస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

జంగ్ తెలంగాణ

దివ్యంగా రాట్నం తిప్పారు..

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తరపున ఆయన కోడలు దివ్యా రెడ్డి గురువారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత కార్మికుడి ఇంట్లో రాట్నం తిప్పుతూ, చేయి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.



జనగామలో రాట్నం తిప్పుతూ ప్రచారం చేస్తున్న దివ్య

–జనగామ

ప్రచారం నిర్వహిస్తున్న కడియం కూతుళ్లు



తండ్రి తరఫున ముగ్గురు కూతుళ్లు..

బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి తరపున ఆయన ముగ్గురు కూతుళ్లు కావ్య, దివ్య, రమ్య గురువారం మండలంలోని ఇప్పగూడెంలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు బొట్టు పెడుతూ నాన్నను గెలిపించాలని అభ్యర్థించారు.

–స్టేషన్‌ఘన్‌పూర్

ఎ'లక్షణం'గా సాగేందుకు..

- వివిధ స్థాయిల్లో ఎన్నికల అధికారుల విధులు
- బూత్ లెవెల్ నుంచి జిల్లాస్థాయి వరకు..
- ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు చర్యలు



భూపాలపల్లి అర్బన్: ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రధానమైనది. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే ఎన్నికల్లో పౌరుడు తన ఓటు హక్కుతో నచ్చిన నేతను ప్రజాప్రతినిధిగా ఎన్నుకుంటాడు. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి నుంచి మొదలు.. గ్రామస్థాయిలోని పోలింగ్ బూత్ లెవల్ అధికారి (బీఎల్వో) వరకు సమన్వయంతో విధులు నిర్వహిస్తేనే ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తవుతుంది. ఎక్కడ ఏ చిన్న లోపం ఏర్పడినా ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలుగుతుంది. బరిలో ఉన్న అభ్యర్థులు నామినేషన్ పత్రాల దాఖలు మొదలు... ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. తాజాగా తెలంగాణ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా స్థాయి అధికారులు వారి ఉన్నతాధికారులు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి ఎన్నికల అధికారి (కలెక్టర్) నుంచి.. బూత్ లెవెల్ అధికారి (బీఎల్వో) వరకు.. వివిధ స్థాయిలోని ఎన్నికల అధికారుల విధుల గురించి తెలుసుకుందాం..

జిల్లా ఎన్నికల అధికారి

జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. మిగతా ఎన్నికల నిర్వహణ అధికారులు కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. కిందిస్థాయి అధికారులకు విధులు కేటాయిస్తూ నిరంతరం సమీక్షలు జరుపుతారు. అధికారుల అందరికీ దిశానిర్దేశం చేస్తారు. జిల్లాస్థాయిలో కావాల్సిన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వాటిని పర్యవేక్షిస్తారు. ఓటరు జాబితా రూపకల్పన మొదలు.. ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి పూర్తయ్యే వరకు.. జిల్లా ఎన్నికల అధికారిదే పూర్తి బాధ్యత.

రిటర్నింగ్ అధికారి

రిటర్నింగ్ అధికారి నియోజకవర్గానికి ఒకరు ఉంటారు. వీరిని ఆయా నియోజకవర్గానికి సంబంధించిన శాసనసభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల కమిషన్ నియమిస్తుంది. తమ పరిధిలోని ఎన్నికల ప్రక్రియను వీరు పర్యవేక్షిస్తారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం, శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి, వసతుల కల్పన, తదితర అంశాలు వీరి పరిధిలో ఉంటాయి.

సెక్టోరియల్ అధికారి

ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడానికి సెక్టోరియల్ అధికారులు కీలక పాత్ర పోషిస్తారు. ముఖ్యంగా పోలింగ్ బూత్‌ల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తారు. ఒక్కొక్కరి పరిధిలో దాదాపు 6 నుంచి 9 పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. వాటిలో ర్యాంపుల ఏర్పాటు, తాగునీటి వసతి, ఫర్నీచర్, విద్యుత్, లైట్లు, ఫ్యాన్లు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణ జరిగేలా చూస్తారు. తమ పరిధిలో జరిగే అంశాలకు వీరే బాధ్యత వహిస్తారు.

ప్రిసైడింగ్ అధికారి

ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో జరిగే అన్ని విషయాలకు అతడిదే సంపూర్ణ బాధ్యత. ఓటింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఇతర సామగ్రి తీసుకొస్తారు. పోలింగ్ అనంతరం ఎన్నికల సామగ్రిని తిరిగి నియోజకవర్గస్థాయి స్ట్రాంగ్ రూమ్‌కు చేరుస్తారు. వీరికి సహాయకంగా అదనపు ప్రొసీడింగ్ అధికారి ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే కార్యకలాపాలాన్నీ వీరి పర్యవేక్షణలోనే ఉంటాయి. ఎన్నికల సంఘం రూపొందించిన నియమావళికి అనుగుణంగా వీరు పనిచేస్తారు. వీరితోపాటు మరో ఇద్దరు పోలింగ్ అధికారులు పనిచేస్తారు. పోలింగ్ బూత్‌లలోని ఈవీఎంల పనితీరు, ఇతర కార్యకలాపాలకు వీరిదే బాధ్యత.

ఓటు నమోదు అధికారులు

బూత్ స్థాయి అధికారులు అందించిన సమాచారంతో ఓటరు జాబితాను తయారు చేయడం వీరి ప్రధాన బాధ్యత. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు జాబితాలో పేర్లు సరిచేసుకునేవారు ఈ అధికారిని సంప్రదించాల్సి ఉంటుంది. తుది ఓటరు జాబితా రూపకల్పనలో వీరిదే ప్రధాన పాత్ర.

బూత్ లెవెల్ అధికారులు

ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో గ్రామస్థాయిలో పనిచేసే వారే బూత్ లెవెల్ అధికారులు(బీఎల్వోలు). గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన యువత, ఓటు హక్కుకు అర్హులైన వారిని ఓటు నమోదు చేసుకునేలా వీరు అవగాహన కల్పిస్తారు. కావాల్సిన దరఖాస్తులు వీరి వద్ద ఉంటాయి. పూర్తి చేసిన దరఖాస్తులను స్వీకరించి నమోదు చేసిన అనంతరం తుది జాబితా ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల మార్పునకు సంబంధించి ఉన్నతాధికారులకు సహకరించడం వీరి ప్రధాన బాధ్యత.

కుట్టు మిషన్లు స్వాధీనం..



ఓ ఫంక్షన్ హాల్‌లో నిల్వ ఉంచిన కుట్టు మిషన్లు

నడికూడ: పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారిపై మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీసీఎం తనిఖీ చేయగా అందులో సుమారు 50 వరకు కుట్టు మిషన్లు, అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధితో ఉన్న ఫ్లెక్సీతో పాటు, ఇతర సామగ్రి లభించాయి. దీనిపై డ్రైవర్‌ను వివరణ అడగగా పరకాల మండలంలోని వెలంపల్లి, పోచారం గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు పంపిణీ చేయడానికి మండలంలోని వరికోల్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. దీంతో పోలీసులు కుట్టు మిషన్లు స్వాధీనం చేసుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించగా పరకాల ఆర్డీఓ కార్యాలయానికి తరలించారు. అలాగే, విశ్వసనీయ సమాచారం మేరకు వరికోల్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో సుమారు 460 వరకు కుట్టు మిషన్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో తాత్కాలికంగా ఫంక్షన్ హాల్ సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆయుర్వేద వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే

కాశిబుగ్గ: వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు బీఏఎంఎస్ రెండవ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డేను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సీనియర్, జూనియర్ విద్యార్థులు కలిసిమెలిసి ఉంటూ చదువుకోవాలని సూచించారు. కృషిపడి చదివి ఉన్నతులుగా ఎదిగి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైద్యశాల సూపరింటెండెంట్ జగన్మోహనాచారి, ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటు.. వదలనీయం..

ఎన్నికల నిర్వహణలో బ్లాగ్ విధులు
- ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన
- ప్రలోభాల కట్టడికి పకడ్బందీ చర్యలు

కాజీపేట: ఎన్నికలు సక్రమంగా జరగడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్‌లెవల్ అవేర్‌నెస్ గ్రూప్(బ్లాగ్)ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ, సెమీ ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి, స్థానిక ఓటర్లతో పరిచయం ఉండి, ఆ ప్రాంతంలో ఓటు హక్కు కలిగి ఉన్న స్థానిక వ్యక్తులను, ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఉన్న వారిని బ్లాగ్‌లో సభ్యులుగా నియమిస్తారు. ప్రతి బ్లాగ్‌లో బీఎల్వో బృంద సభ్యుడు నాయకుడిగా ఉండగా ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు, ఆశావర్కర్, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్, మహిళా సంఘాల బుక్ కీపర్లను సభ్యులుగా నియమిస్తూ ఎన్నికల అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వారందరికీ నియామక ఉత్తర్వులు జారీ చేయడమే గాకుండా విధి నిర్వహణలో అవగాహన కల్పించారు.

బ్లాగ్ బాధ్యతలు ఇలా..
- ఓటర్లకు అవగాహన కల్పించి చైతన్యపర్చడం, ఓటింగ్‌లో పాల్గొనేలా చేయడం.



- ఓటు హక్కును కలిగి ఉన్నవారంతా తమ ఓటును వినియోగించుకునేలా ప్రోత్సహించడం.
- మద్యం, డబ్బు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా వాల్‌పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేసి ఓటు ప్రాధాన్యత వివరించడం.
- ఎన్నికల్లో ఓటు ఆవశ్యకతపై పోలింగ్ బూత్ స్థాయిలోని పాఠశాలలో ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించడం వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం.
- గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, వృద్ధులకు ఓటింగ్ కోసం ఎన్నికల కమిషన్ కల్పిస్తున్న సౌకర్యాలు వివరించడం.
- దివ్యాంగులకు ర్యాంపు, ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించడం.
- వయోవృద్ధులు, పదవి విరమణ పొందిన అధికారులు ఓటింగ్ ఆవశ్యకతను తెలిపే ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం వంటి పనులు ఉంటాయి.

అభివృద్ధి చేసే పార్టీని ఆదరించండి..

హన్మకొండ: అభివృద్ధి చేసే పార్టీని ఆదరించాలని బీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ అధ్యక్షుడు, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కూర్మాచలం అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలన్నారు. బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ ప్రధాన కార్యదర్శి కడుదుల రత్నాకర్, ఎన్‌ఆర్‌ఐ సెల్ అమెరికా నాయకురాలు బిందులత మాట్లాడుతూ దేశంలోనే రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి గొప్ప పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయాలన్నారు. సమావేశంలో ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు కోరబోయిన విజయ్ కుమార్, నవీన్ రెడ్డి, గొట్టిముక్కల సతీష్ రెడ్డి, రాజ్ కుమార్, ప్రవీణ్ పంతులు, వినయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్ కూర్మాచలం

రూ.19.67 లక్షల నగదు స్వాధీనం



ఎల్కతుర్తి : వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృత వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆధారం లేకుండా తరలిస్తున్న రూ. 19.67 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

మానుకోటలో రూ.9. 95 లక్షలు..

మహబూబాబాద్ రూరల్ : పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బుక్క బజార్ సమీపంలో గురువారం ఓ వ్యక్తి వద్ద రూ.9. 95 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. కేసముద్రం మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి ఆధారం లేకుండా తరలిస్తున్న ఈ నగదును పట్టుకుని సీజ్ చేశామని డీఎస్పీ తెలిపారు.

కేసముద్రంలో రూ.6 లక్షలు..

కేసముద్రం: మండల కేంద్రంలోని మార్కెట్ సమీపంలో కేసముద్రం విలేజ్‌కి చెందిన వ్యాపారి సట్ల శ్రీను రూ.3 లక్షలు, కేసముద్రంస్టేషన్‌కు చెందిన మరోవ్యాపారి చిదురాల వసంతరావు వద్ద రూ.3లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. ఈ నగదుకు ఆధారం చూపకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఎల్కతుర్తిలో రూ. 2.32 లక్షలు..

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని బస్టాండ్ క్రాస్ వద్ద గురువారం ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.2.32 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు రాజ్‌కుమార్, సాయిబాబు తెలిపారు. సేల్స్‌మెన్ అజ్మీరా అశోక్ హనుమకొండ నుంచి హుజూరాబాద్ వైపునకు ఆటోలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆటోను తనిఖీ చేయగా నగదు లభ్యం కావడంతో స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని సీఐ తెలిపారు.

డోర్నకల్‌లో రూ.1.40 లక్షలు..

డోర్నకల్: డోర్నకల్ పట్టణ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద గురువారం రూ.1.40 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారెపల్లి మండలం ఎర్రబోడు మాణిక్యారం గ్రామానికి చెందిన భూక్యా శోభన్ ఆధారం లేకుండా నగదును తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గీత కార్మికుడి మృతి

తొర్రూరు రూరల్ : తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని గోపాలగిరిలో జరిగింది. గ్రామానికి చెందిన ఎనమాల వెంకటపతి(53) రోజుమాదిరిగానే ఉదయం తాటిచెట్టు ఎక్కుతూ కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి: ఎమ్మెల్యే హరిప్రియ



బయ్యారం : వెంకట్రాంపురంలో అభివాదం చేస్తున్న హరిప్రియ



ఇల్లెందు : పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బయ్యారం: ఎమ్మెల్యేగా తాను ఎన్నికయ్యాక జరిగిన అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తోందని.. ఈ పనులను చూసి మరోమారు తనను గెలిపించాలని బీఆర్‌ఎస్ ఇల్లెందు అభ్యర్థి హరిప్రియ కోరారు. బయ్యారం మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారానికి హాజరైన ఆమె మాట్లాడారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇచ్చామన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరాయని తెలిపారు. బయ్యారం చెరువుకు రావాల్సిన సీతారామ జలాలను ఇతర ప్రాంతానికి తరలిస్తున్నా.. గత ఎమ్మెల్యే పట్టించుకోలేదని ఆరోపించారు. తాను సీఎం కేసీఆర్‌తో బయ్యారం, గార్ల మండలాల రైతుల తరపున మాట్లాడి రూ.3,200 కోట్లతో సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకొచ్చేందుకు కృషి చేశానన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య, ఎంపీపీ మౌనికతోపాటు గణేష్, సత్యనారాయణ, కవిత, భద్రయ్య, జగన్, రామకృష్ణ, శ్రీకాంత్, ఐలయ్య, శ్రీను, లక్ష్మణ్, వెంకన్న, సంపత్, రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని ఇర్సులాపురం, కొత్తగూడెం, కాచనపల్లి గ్రామాలకు చెందిన పలువురు వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరగా హరిప్రియ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఇల్లెందు, గార్లలో ప్రచారం...

ఇల్లెందు/గార్ల: బీఆర్‌ఎస్ ఇల్లెందు అభ్యర్థి, ఎమ్మెల్యే హరిప్రియను గెలిపించాలని కోరుతూ ఇల్లెందులోని పలు వార్డుల్లో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇప్పటిలాగే అభివృద్ధి కొనసాగాలంటే హరిప్రియను మరోమారు గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్‌తో పాటు ఎస్.రంగనాథ్, కొక్కు నాగేశ్వరరావు, గిన్నారపు రజిత, మేకల శ్యాం తదితరులు పాల్గొన్నారు. అలాగే, గార్ల మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఇంటింటి ప్రచారంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్‌తో పాటు శీలంశెట్టి రమేష్, రాధాకృష్ణ, భాస్కర్‌రావు, గాజుల గణేష్, రవీందర్, వెంకటేశ్వర్లు, నిర్మల, ఉమేష్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికీ ప్రజాభీష్టం మేరకే నడుచుకుంటున్నా..



ఇల్లెందురూరల్ : రోడ్డుషోలో మాట్లాడుతున్న కోరం కనకయ్య



కామేపల్లి : పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కనకయ్య, నాయకులు

ఇల్లెందురూరల్: దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలతోనే కలిసి ఉంటూ ప్రజాభీష్టం మేరకు నడుచుకుంటున్నానని కాంగ్రెస్ ఇల్లెందు అభ్యర్థి కోరం కనకయ్య తెలిపారు. ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. ఇల్లెందు మండలంలోని పలుగ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తాను కొనసాగిన సమయాన అనేక అభివృద్ధి పనులు చేశానని గుర్తుచేశారు. అయితే, ఈ ప్రాంతానికి గోదావరి జలాలు తరలిస్తామని నమ్మించిన సీఎం కేసీఆర్ రోళ్లపాడులో సీతారామ ప్రాజెక్టు నిర్మాణాన్ని శంకుస్థాపనకే పరిమితం చేసిందని ఆరోపించారు. ఈసారి తనను గెలిపిస్తే కొమరారం మండలాన్ని సాధించడమే కాక కాంగ్రెస్ గ్యారంటీల ద్వారా ప్రతీ కుటుంబానికి మేలు జరిగేలా కృషిచేస్తానని తెలిపారు. ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, కాంగ్రెస్, వైఎస్సార్ టీపీ నాయకులు బానోత్ సుజాత, యదళ్లపల్లి అనసూర్య, బానోత్ రోజా, శారద, పులి సైదులు, మండల రాము, పూనెం సురేందర్, మూతి కృష్ణ, కిన్నెర నర్సయ్య, తాటి రాంబాబు పాల్గొన్నారు. కాగా, రోడ్డు షో మధ్యలో కనకయ్య కాలి గాయం తిరగబెట్టడంతో చికిత్స కోసం వెళ్లిపోగా, సర్వేతండా వద్ద వేచి ఉన్న స్థానికులు వాహనంపై ఆయన ఫొటోకు పూలు చల్లి అభిమానం చాటుకున్నారు.

సైనికుల్లా పని చేయాలి

ఇల్లెందు/కామేపల్లి/గార్ల: కాంగ్రెస్ అభ్యర్థి కనకయ్య విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ నాయకుడు మువ్వా విజయబాబు పిలుపునిచ్చారు. కామేపల్లి మండలం కొత్తలింగాల క్రాస్ వద్ద ఎన్నికల కార్యాలయాన్ని కోరం కనకయ్య, నాయకుడు గోపాల్‌రెడ్డితో కలిసి ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ పాలనను కోరుకుంటున్నందున కార్యకర్తలు కొద్దిరోజులు కష్టపడితే విజయం సులువవుతుందని తెలిపారు. అనంతరం కనకయ్య మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ మారి తప్పు చేసిన తనను క్షమించాలని కార్యకర్తలను కోరారు. ఇకనుంచి పార్టీ మారే ప్రసక్తి లేదని, కార్యకర్తలను కాపాడుకుంటానని తెలిపారు. తొలుత దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నాయకులు గింజల నరసింహారెడ్డి, మేకల మల్లిబాబయాదవ్, మద్దినేని రమేష్‌బాబు, దమ్మలపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇక ఇల్లెందులో పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటటేశ్వర్లు ఆధ్వర్యాన కనకయ్యను గెలిపించాలని ప్రచారం చేశారు. కాగా, అధిష్టానం సూచన మేరకు నామినేషన్ ఉపసంహరించుకున్న తాను పార్టీ అభ్యర్థి కనకయ్య విజయానికి కృషి చేస్తానని గార్ల మండలం సీతంపేట ఎంపీటీసీ నాగమణి వెల్లడించారు.